క్లుప్తంగా

ఇరిగేషన్ డీఈగా బాధ్యతల స్వీకరణ


మనోజ్ కుమార్

కొయ్యలగూడెం: జల వనరుల శాఖ ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ అప్‌లాండ్ సబ్ డివిజన్ (పీడబ్ల్యూడీ శాఖ) డీఈగా గుర్రాల మనోజ్ కుమార్ కొయ్యలగూడెంలోని కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. పోలవరం ప్రాజెక్టు డీఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా తన కార్యాలయం ఆయన మాట్లాడుతూ సాగునీటి చెరువుల్లో సుమారు రూ.50 లక్షల విలువైన అభివృద్ధి పనులను వర్షాలు ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్టు చెప్పారు. సాగునీటి చెరువుల్లోని అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు చేపడతానని పేర్కొన్నారు.

సువర్చల హనుమద్ కల్యాణం


హనుమద్ సువర్చల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మండలం మద్ది క్షేత్రంలో పూర్వాభాద్రా నక్షత్రం సందర్భంగా ఆలయంలో హనుమద్ సువర్చల కల్యాణం నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లను ఆశీనులను చేసి, వైఖానస ఆగమ శాస్త్రబద్ధంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారని ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

అయ్యప్పకు పూజలు


పూజలు అందుకున్న అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెంలో ఉన్న శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు అర్చకులు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రమేష్‌బాబుకు అభినందనలు


మిడత రమేష్ బాబు

కామవరపుకోట: వైఎస్సార్ సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కార్యదర్శిగా కామవరపుకోటకు చెందిన మిడతా రమేష్‌బాబును పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియమితులయ్యారు. ఆయన 2011 నుంచి ఇప్పటివరకు పార్టీ కామవరపుకోట మండల కన్వీనర్‌గా పని చేస్తూ వచ్చారు. ఈ సందర్భంగా ఆయన జగన్‌మోహన్ రెడ్డితో పాటు, స్థానిక నాయకులకు ఆయన కృతజ్ఞతల తెలిపారు. పార్టీ పటిష్టతకు, బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రమేష్‌బాబుకు పార్టీ నేతలు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

రోడ్డు ఎత్తు పెంచి డ్రెయిన్ నిర్మించండి


వినతిపత్రం అందిస్తున్న నాసర్ పాషా

టి.నరసాపురం: టి.నరసాపురం ప్రధాన కూడలిలో రోడ్డు ఎత్తు పెంచి, డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా అన్నారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వినతిపత్రం అందజేశారు. టి.నరసాపురం బందంచర్ల రోడ్డు అంబేడ్కర్ సెంటర్ నుంచి కొద్ది దూరం వరకు వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోతుందన్నారు. రోడ్డు ఎత్తుగా లేకపోవడం, మురుగునీరు వ్యవస్థ లేని కారణంగా వరద నీరు, డ్రెయిన్ నీరు రోడ్డుపై వచ్చి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని వివరించారు. అధికారులు స్పందించి, రోడ్డు ఎత్తు పెంచి, డ్రెయిన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, టి.నరసాపురం యూనియన్ బ్యాంకు వద్ద మెయిన్ రోడ్డుపై వరదనీరు నిలవకుండా చూడాలని కోరారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

లింగపాలెం: వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని రైతులకు మండల వ్యవసాయ అధికారి వి.ప్రదీప్‌కుమార్ సూచించారు. మండలంలోని రంగాపురం, భోగోలు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. భూసార పరీక్షల ప్రాముఖ్యత, పచ్చిరొట్ట పైర్లు వల్ల ఉపయోగాలు, కౌలు రైతులకు కౌలు కార్డుల ఉపయోగాన్ని వివరించారు. ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రంగాపురం, భోగోలు గ్రామాల నాయకులు, రైతులు, వ్యవసాయ శాఖ వీఏఏ పాల్గొన్నారు.

ప్రజలను వంచించిన ప్రభుత్వం


కొయ్యలగూడెం : పోస్టర్ విడుదల చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు


కుక్కునూరు : పుస్తకావిష్కరణ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వం ప్రజలను వంచించిందని, ప్రజల ఆశలను నట్టేట ముంచిందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు పేర్కొన్నారు. బుధవారం మేకల గోపాలరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో పార్టీ సీనియర్ నాయకులు మేకల అన్నవరం ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్ అంటే నమ్మకం, చంద్రబాబు అంటే మోసం బుక్‌లెట్ ఆవిష్కరించారు. ఎన్నికల సమయంలో 153 హామీలు అమలు చేస్తామని, అందులో ముఖ్యంగా సూపర్ సిక్స్ పాలనలోకి వచ్చిన వెంటనే ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని, కాని సంవత్సరం దాటినప్పటికీ హామీలు అమలుకు నోచుకోలేదని అన్నారు. రాష్ట్రంలో మొత్తం 87,41,885 విద్యార్థులకు తల్లికి వందనం సొమ్ము ఇవ్వాల్సి ఉండగా 67,27,164 మందికి మాత్రమే సొమ్ము మంజూరు చేయటం కూటమి ప్రభుత్వం చేసిన దగా అన్నారు. తల్లికి వందనం కార్యక్రమానికి రూ.13,050 కోట్లు అవసరం కాగా, దగా ప్రభుత్వం రూ.8,745 కోట్లు మాత్రమే మంజూరు చేసి తల్లుల ఆశలపై నీళ్లు చల్లింది ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పొగాకు రైతులను ఆదుకోవడానికి మార్క్‌ఫెడ్ ప్రవేశపెట్టి కిలో పొగాకు రూ.366లకు కొనుగోలు చేసే విధంగా కృషి చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం మార్క్‌ఫెడ్ సంస్థానం కొనుగోళ్లలోకి ఎందుకు ప్రవేశ పెట్టడం లేదని ప్రశ్నించారు. దీంతో రూ.240కు పొగాకు ధర పలకడం లేదని, రైతులు నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. రెడ్ బుక్ రాజ్యాంగ అమలుకే కూటమి ప్రభుత్వం పాలన చేస్తోందని, మహిళలకు రాష్ట్రంలో రక్షణ లేకుండా పోయిందని అన్నారు. హోం మంత్రి మహిళా అయి ఉండి కూడా మహిళలకు రక్షణ కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గంజిమాల రామారావు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు గంటా శ్రీను, చిటికెన శ్రీను, టౌన్ ప్రెసిడెంట్ శంకు కొండ, నాయకులు నూకల రాము, చిక్కాల దుర్గాప్రసాద్, తేలే శ్రీను, దూలపల్లి కాంతారావు, చిడిపి రవి, ఎస్‌కే బాజీ, మారిశెట్టి శ్రీను, జుంగా బాబ్జి, చిటికెన నాగార్జున, అగ్గిరాజు, చవల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హామీ అమలులో విఫలం

కుక్కునూరు: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటే నమ్మకం.. చంద్రబాబు అంటే మోసం పుస్తకాన్ని బుధవారం కుక్కునూరులో వైఎస్సార్ సీపీ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తాండ్ర రాజేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచినా హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. చంద్రబాబు మనస్తత్వం ఏరు దాటాక తెప్ప తగలేసే విధంగా ఉందన్నారు. అందుకే అధికారంలోకి రావడానికి సూపర్ సిక్స్‌ను అడ్డంపెట్టుకొని, తీరా అధికారం చేపట్టాక వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన పారదర్శకంగా, సంక్షే పథకాలతో, పటిష్టమైన లా అండ్ ఆర్డర్‌తో, మంచి విద్య, వైద్య సేవలతో సాగితే.. చంద్రబాబు ప్రభుత్వంలో మొత్తం అశాంతి, అరాచకం, ఆటవిక పాలన రాజ్యమేలుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఈ ఆటవిక పాలనకు ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రావు వినోద్, కుచ్చర్లపాటి చిన్న నరసింహరాజు, చేకూరి నవీన్, పగిళ్ల అల్లేష్, గంజి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీగా మస్తాన్ బాషా



మాజీ హోం మంత్రి వనితతో మస్తాన్ బాషా

ద్వారకాతిరుమల: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు షేక్ మస్తాన్ బాషాను పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ఈ పదవి దక్కడానికి కారణమైన మాజీ హోం మంత్రి, వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితకు మస్తాన్ బాషా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. మస్తాన్ బాషాను పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

మహాసభల విజయవంతం కోరుతూ ర్యాలీ


మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చింతలపూడి : జూలై 5, 6, 7 తేదీలలో నిర్వహించ తలపెట్టిన సీపీఐ ఏలూరు జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మామిళ్లపల్లి వసంతరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం చింతలపూడి మండలంలోని పలు గ్రామాల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వసంతరావు మాట్లాడుతూ మహాసభల్లో చింతలపూడి అభివృద్ధికి ఉపయోగపడే ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, ఈ పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.40 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. చింతలపూడి కేంద్రంగా విస్తరించి ఉన్న బొగ్గు నిల్వలను వెలికి తీయాలన్నారు. నియోజకవర్గంలోని చెరువులకు గోదావరి జలాలను మళ్లించాలని కోరారు. వన సంరక్షణ సమితి సభ్యులకు వ్యక్తిగతంగా మొక్కలు పెంచుకునే అవకాశం ఇవ్వాలన్నారు. చింతలపూడిలో ప్రారంభమైన ర్యాలీ రేచర్ల, ఎర్రగుంటపల్లి, అల్లిపల్లి, సీతానగరం, చింతపల్లి, కమలాపురం, ఎండపల్లి, రాఘవపురం, గణిజర్ల, మల్లయ్యగూడెం, సమ్మెట వారి గూడెం మీదుగా చింతలపూడి చేరుకుంది. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల గురవయ్య, మండల సహాయ కార్యదర్శి దొంతా కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పుల్లూరు సోమశేఖర్, మండల కౌన్సిల్ సభ్యుడు ఎస్‌కే మస్తాన్, ఎం అలెగ్జాండర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు, ప్రజా నాట్య మండలి గాయకుడు ఎస్ లెనిన్ బాబు, ఏఐవైఎఫ్ జిల్లా కో కన్వీనర్ తొర్లపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం


విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ హైస్కూల్స్ నుంచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈఓ జె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో సన్మానించారు. తోట భార్గవి లక్ష్మీ దుర్గ బాలికల హైస్కూల్ (580), కందుల నోషిత జెడ్పీహెచ్ఎస్ బయ్యన్నగూడెం (576), మంగాదేవి (559) పరింపూడి బాలికల హైస్కూల్ నుంచి మెరుగైన మార్కులు సాధించడంతో వారి తల్లి దండ్రులతో సహా శాలువాలతో సత్కరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యలో రాణిస్తున్నారని, దీనిని కొనసాగించాలని ప్రజాప్రతినిధులు అధికారులు కోరారు. తహసీల్దార్ ఎన్ నాగరాజు, ఎంపీడీఓ కె.కిరణ్‌కుమార్, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు మండలి చైర్మన్ పరామర్శ


ప్రేమ్ కుమార్‌ను పరామర్శిస్తున్న మండల చైర్మన్ మోషేన్‌రాజు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ మండల యువ జన నాయకుడు బిరుదుగడ్ల ప్రేమ్ కుమార్‌ను బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పరామర్శించారు. ప్రేమ్ కుమార్ ఇటీవల ఆటో ప్రమాదానికి గురై కాలుకు తీవ్ర గాయం కావడంతో పరామర్శించడానికి వచ్చినట్లు మోషేన్ రాజు తెలిపారు. ప్రేమ్ కుమార్ తల్లి ఎంపీటీసీ రత్నకుమారికి భరోసా చెప్పి ధైర్యం కల్పించారు. మోషేన్ రాజు రాకతో స్థానిక మహిళలు పెద్ద ఎత్తున ఎంపీటీసీ నివాసానికి తరలివచ్చారు. రేషన్ వాహనాలు (ఎండీయూ) లేకపోవడం వల్ల, తల్లికి వందనం సొమ్ము అకౌంట్లో పడని వారు తమ ఇబ్బందులను మోషేన్ రాజు వద్ద పేర్కొన్నారు. వారి పూర్తి వివరాలను తనకు పంపాలని ఎంపీటీసీకి మోషేన్ రాజు సూచించారు. సర్పంచులు ఏలేటి చిన్న తుక్కయ్య, కడకట్ల గడ్డియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు గంట రమేష్, కసుకుర్తి వేణు, ఎం.సోమేశ్వరరావు, కరుటూరు లాజర్, బి.రవికిరణ్, డి.రాయుడు, బి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్ట్ కక్ష సాధింపే


సూర్యనారాయణరావు

దెందులూరు: వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ కూటమి సర్కారు కక్ష సాధింపులో భాగమేనని కూటమి సర్కార్ అక్రమ అరెస్టులు, దాడులు దౌర్జన్యాలపై రాష్ట్ర బీసీ సంఘం త్వరలో ప్రణాళిక సిద్ధం చేస్తుందని వైఎస్సార్‌సీపీ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఎం సూర్యనారాయణరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సమస్యల పట్ల అవగాహన కలిగిన విద్యార్థి సంఘ నాయకుడిగా వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా సంఘ సేవకునిగా భాస్కర్‌రెడ్డికి సమాజంలో మంచి పేరు ఉందని తెలిపారు. అక్రమంగా ఆయన్ని అరెస్టు చేసినంత మాత్రాన ఆయన లక్ష్యాన్ని దెబ్బతీయలేదని వైఎస్ జగన్ సైనికుడిగా మరింత బలంగా వేగంగా ముందుకు నడుస్తాడని భాస్కర్ రెడ్డికి రాష్ట్ర బీసీ సంఘం మద్దతు ప్రకటిస్తోందని సూర్యనారాయణ అన్నారు. అక్రమ అరెస్టులు వేధింపులు దౌర్జన్యాలపై రాష్ట్ర బీసీ సంఘం త్వరలోనే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తామని అన్నారు.

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి


రోడ్ల పరిస్థితిని పరిశీలిస్తున్న అభిషేక్‌బాబు, రైతులు, వర్తకులు

టి.నరసాపురం: గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే సర్వీస్ రోడ్డును మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో నిర్మించాలని స్వచ్ఛ సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత, వైఎస్సార్ సీపీ నాయకులు పెండ్యాల అభిషేక్‌బాబు కోరారు. బుధవారం మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేపైకి వెళ్లేందుకు బొర్రంపాలెం గ్రామం, పరిసర గ్రామాల ప్రజలకు, రైతులు, వర్తకులు సర్వీస్ రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎంపీ పుట్ట మహేష్‌యాదవ్, ఎమెల్యే చిర్రి బాలరాజులు ప్రజలు, రైతుల వాణిని కేంద్రంలో గట్టిగా వినిపించి సర్వీస్ రోడ్లు తారు రోడ్లుగా మార్చి ఈ ప్రాంత ప్రజలకు అందించాలని అభిషేక్‌బాబు కోరారు. కార్యక్రమంలో రైతులు, వర్తకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నసమారాధన


స్వామి వారికి అన్నప్రసాద నైవేద్యం సమర్పించేందుకు వెళుతున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: స్థానిక హై స్కూల్ వద్దగల శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అన్నప్రసాద వితరణ కమిటీ వారిచే బుధవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నప్రసాదాన్ని స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం సుమారు 1800 మంది భక్తులు పంపిణీ చేశామని ఆర్గనైజర్ కానూరి గంగాధరరావు తెలిపారు. కార్యక్రమానికి గుడ్ల లక్ష్మి, చిట్టూరి ధనరాజు, తడికమళ్ల శ్రీనివాస్ దంపతులు, అవినాష్, గ్రాండ్ కృష్ణ రెస్టారెంట్ యాజమాన్యం సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో శీధరాల శ్రీనివాస వెంకట గంగాధర్, చల్లా వరప్రసాద్, కోటగిరి లక్ష్మీ ప్రసన్న, కొమ్మసాని రవీంద్ర రెడ్డి, బొప్పినీడు నాగేశ్వరరావు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత


గుంటుపల్లి గుహల వద్ద యోగాసనాలు

కామవరపుకోట: ప్రతిరోజూ యోగ సాధనతో ఆరోగ్యంగా మానసికంగా ప్రశాంతంగా ఉంటామని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ విజయరాజు తెలిపారు. 11 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలో గుంటుపల్లి గ్రామ పంచాయతీ జీలకర్రగూడెం బౌద్ధ గుహల వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పర్యాటక శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పట్టాభి మాట్లాడుతూ యోగాలో శారీరక భంగిమలు, శ్వాస పద్ధతులు ధ్యానాన్ని ఏకం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. సెట్ వెల్ సీఈఓ ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు యోగ చేయడం వల్ల క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం అలవడి ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందని చెప్పారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగాపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

21న 5 వేల మందితో యోగాభ్యాసన

కలెక్టర్ కె.వెట్రిసెల్వి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ

ఏలూరు(మెట్రో): ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఏలూరులోని సర్ సీఆర్ రెడ్డి కళాశాలలో 5 వేల మందితో మెగా యోగాభ్యాసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సన్నద్ధత, తదితర అంశాలపై బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 21న యోగ దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల 21న ఏలూరులోని ఇండోర్ స్టేడియం, మరో ప్రాంతంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. జిల్లాలో ఇంతవరకు యోగాంధ్ర కార్యక్రమంలో 9,02,421 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నట్టు తెలిపారు. యోగాభ్యాసన కార్యక్రమాల్లో భాగస్వాములైన వారిలో 6,91,418 మందికి సర్టిఫికెట్లు జారీ చేయగా, అందులో 29,639 మంది సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్స్ పొందారని వివరించారు. సమావేశంలో డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, ట్రాన్స్‌కో ఎస్ఈ సల్మాన్‌రాజు, సీపీఓ వాసుదేవరావు, డీఈఓ వెంకటలక్ష్మమ్మ, సెట్వెల్ సీఈఓ ప్రభాకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఆర్ఐఓ యోహాన్, ఆయుష్ డీడీ లక్ష్మి శారద, డీఎంహెచ్ఓ డా. మాలిని పాల్గొన్నారు.

21న వైఎంహెచ్ఏలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఏ) 121 సంవత్సరాల ఉత్సవాల్లో భాగంగా ఈనెల 21న ప్రపంచ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్టు సంస్థ మేనేజ్మెంట్ కమిటీ అధ్యక్షుడు యర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి గుడిపాటి లలితా శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు వేణుగోపాల్ లునాని, పి.సాంబశివరావుల ఆధ్వర్యంలో దత్త క్రియ యోగాలో శిక్షణ నిర్వహిస్తారని తెలిపారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం


దేవులపల్లిలో మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

జంగారెడ్డిగూడెం: మండలంలోని దేవులపల్లి గ్రామంలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎంఎస్ఎస్ఎస్ పద్మజకు చెందిన వస్త్ర దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి వస్త్రాలన్నీ దగ్ధమయ్యాయి. వెంటనే స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ అబ్రహాం సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అప్పటికే వస్త్ర దుకాణంలో వస్త్రాలు పూర్తిగా ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లనున్నట్టు ఫైర్ ఆఫీసర్ అబ్రహాం తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం


భోజనం రుచి చూస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. బుధవారం శనివారపుపేట జెడ్పీ హైస్కూల్‌ను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే ఆహార విషయంలో రాజీ పడవద్దని, వంటల్లో ఉపయోగించే నూనె విషయంలో మరింత నాణ్యత పాటించాలని సూచించారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. బాలబాలికలు సోదర భావంతో కలిసిమెలిసి చదువుకోవాలన్నారు. డీసీపీఓ సూర్య చక్రవేణి, వన్ స్టాప్ అడ్మిన్ నిర్మల, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఈ నెల 19, 20 తేదీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోలీస్ క్వార్టర్స్, ఎస్పీ ఆఫీసు, పోలీస్ పరేడ్ గ్రౌండ్ ప్రాంతం, అమీనా పేట ఏటిగట్టు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రిక్షా ఘాటి, ఏడు ఘోరీల సెంటర్, వేణు గోపాల స్వామి టెంపుల్, విజయలక్ష్మి థియేటర్, బుద్ధ పార్క్, పంట కాలువ రోడ్డు, హెడ్ పోస్ట్ ఆఫీసు ఏరియా, వైఎంహెచ్ఏ హాల్ ఏరియా, బిర్లా భవన్, మార్కెట్ ఏరియా, పెరుగుచెట్టు, టీచర్ల కాలనీ, పెరుగుచెట్టు, అంబికా థియేటర్, కెనాల్ రోడ్, నవాబ్ పేట, బావిశెట్టివారిపేట, నల్లదిబ్బ, మునిసిపల్ ఆఫీసు, అగ్రహారం, కెనాల్ రోడ్, సత్యనారాయణ పేట, లంబాడి పేట, వెన్నవల్లి వారి పేట, బాలాజీ థియేటర్, జంట కల్యాణ మండపాలు, రామకోటి, ఏడుకాలువల సెంటర్, కొత్తగూడెం, మోటేపల్లివారి వీధి, మేకవారి వీధి, కబేళా ఏరియా, తూర్పు వీధి శివాలయం ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, కత్తేపువీధి, పిచుకగుంట సెంటర్, చిన్న జెండా సెంటర్, వెంకన్నచెరువు రోడ్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు. సత్రంపాడు, మండ్ల వారి వీధి ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు, హనుమాన్ నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, గ్రీన్ సిటీ, పెదపాడు రోడ్, శివ నగర్, సాయి నగర్, గణేశ్ కాలనీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ, ఏరియాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.